# కడసారి చూపు

అంతా అయిపోయింది. గంట క్రితమే తీసుకువెళ్ళారట. జంక్షన్‌లో బస్సు దిగి ఆటోలో వచ్చేసరికి ఇంటిదగ్గర ఎవరూ లేరు. ఎవరో కొద్దిమంది అరుగులమీద కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ళలో ఒక బంధువు అతడిని గుర్తించి –

"ఇప్పుడా రావడం? ఇంత ఆలస్యమయ్యిందేం?" అనడిగాడు విశ్వనాథాన్ని.

విషయం తెలీగానే బయల్దేరాను! బస్సులు దొరకలేదు. అందుకే ఆలస్యమయింది" అబద్ధం చెప్పాడు విశ్వనాథం. అబద్ధం చెబుతున్నప్పుడు విశ్వనాథానికి ఏమీ అనిపించలేదు. తను చెప్పే మాటను వీళ్ళు నమ్మితే బావుండు అనుకున్నాడు.

"గంట క్రితందాకా చూసారు. సూర్యాస్తమయం అవుతోందని గంట క్రితమే శవాన్ని స్మశానానికి తరలించారు. మీ నాన్న కడసారిచూపు కూడా నీకు దక్కలేదే" అన్నాడాయన విచారపడుతూ.

"ఏం చేస్తాం? ప్రాప్తం లేదు" అన్నాడు విశ్వనాథం బాధపడుతున్నవాడిలా. అది కూడా నటనే. విశ్వనాథం నటించాడు.

"నువ్వు రాలేదని మీ తమ్ముడు రామనాథంచేత పని జరిపిస్తున్నారు. దహనం జరిగి ఉంటుంది" అన్నాడాయన మళ్ళీ. విశ్వనాథం మాట్లాడకుండా వెళ్ళి తను కూడా తన ఇంటి బయట వున్న అరుగుమీద చివరగా కూర్చున్నాడు. భుజానికి తగిలించుకున్న బ్యాగ్‌ను తీసి పక్కనపెట్టి.

ఆ సాయంత్రంవేళ రోడ్డున వెళుతున్న ఒకరిద్దరు మనుషులు విశ్వనాథాన్ని గుర్తించి పలకరించారు.

"భార్యను తీసుకురాలేదేం?" ఒకాయన అడిగాడు.

"రాకూడదు" అని మళ్ళీ అబద్ధం చెప్పాడు విశ్వనాథం.

భార్య చాముండేశ్వరిని రమ్మంటే "ఆయన పోయిన తరువాత నేనొచ్చి చేసేదేముంది? ఆ చావింట్లో కూర్చోటానికీ, పడుకోటానికీ వీలుండదు. నేను రాను. నువ్వెళ్ళు" అన్నది విసుగ్గా.

విశ్వనాథం ఒక్కడే మధ్యాహ్నం భోజనం చేసి బయల్దేరాడు నింపాదిగా.

విశ్వనాథం తండ్రి హయగ్రీవరావు ఆ మండల కేంద్రంలో ఆరోజు తెల్లవారుజామున అనారోగ్యంతో చనిపోయాడు. అక్కడే ఉన్న అతని బంధువులు

ఫోన్‌చేసి ఈ విషయాన్ని విశ్వనాథానికి తెలియజేసారు. విశ్వనాథం అక్కడికి బాగా దూరంలో ఉన్న ఒక టౌన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఆరోజు ఆదివారం. ఆఫీసుకు సెలవుపెట్టే పనిలేదని బస్టాండ్‌కు వెళ్ళి తన ఊరికి వెళ్ళే బస్సులు గురించి ఎంక్వైరీ చేసాడు. ఎక్కువగా పాసింజరు బస్సులు ఉన్నాయి. మధ్యాహ్నంవేళ ఒక ఎక్స్‌ప్రెస్ బస్సు ఉంది. పాసింజర్ బస్సులో అంతసేపు కూర్చుని ప్రయాణం చెయ్యడం ఇష్టంలేని విశ్వనాథం, భోజనం చేసి తాపీగా మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్ బస్సులో బయల్దేరాడు. వచ్చేసరికి తండ్రి శవాన్ని తరలించారు. పాసింజరు బస్సులో విషయం తెలియగానే బయల్దేరినట్లయితే మధ్యాహ్నానికి అక్కడకు వచ్చేవాడే.

తండ్రిని కడసారిగా చూసి ఉండేవాడు.

స్మశానానికి వెళ్ళిన మనుషులు తిరిగివచ్చారు. విశ్వనాథాన్ని చూడగానే బావురుమన్నాడు తమ్ముడు రామనాథం.

రాని ఏడుపును అభినయించాడు విశ్వనాథం.

తన యాత్రలో పాల్గొన్న మనుషులు ఆ వీధి చివర గుడి ముందున్న బోరింగ్ పంపు కింద తలస్నానాలు చేసి వచ్చారు.

ఒకతను వచ్చి విశ్వనాథం పక్కన ఉన్న బ్యాగ్‌ను పక్కకు జరిపి విశ్వనాథం పక్కన కూర్చున్నాడు. అతని పేరు నిరంజనం.

విశ్వనాథానికి వరసకు తమ్ముడవుతాడు.

"నువ్వెప్పుడొచ్చావ్?" విశ్వనాథం అడిగాడు.

"పొద్దునే వచ్చాను. నువ్వు ముందుగా వచ్చిఉంటే బాగుండేది. బాబాయి కడసారిచూపు దక్కేది. ఇంక ఈ జన్మలో ఆయన మొహాన్ని చూడలేవుకదా?" అన్నాడు నిరంజనం.

"ఏం చెయ్యను? వీలుపడలేదు!" అని ఇంతకుముందు అందరికీ చెప్పిన కథనే అతనిక్కూడా చెప్పాడు విశ్వనాథం.

"ఇలా అంటున్నానని ఏమీ అనుకోవద్దు. నీకు తెలీదని కాదు. కారు మాట్లాడుకుని అయినా రావలసింది. పెద్ద కొడుకువి అయివుండి తండ్రి అంత్యక్రియలు జరిపే అదృష్టాన్ని పోగొట్టుకున్నావు. నీకెలా ఉందోగానీ నాకుమాత్రం బాధగా ఉంది. తండ్రికి పెద్ద కొడుకుమీద ఎక్కువ ప్రేమ ఉంటుందని అంటారు. ఏం ప్రయోజనం? దురదృష్టవంతుడివి" అన్నాడు నిరంజనం బాధపడుతూ.

విశ్వనాథానికి చాలా ఇబ్బందిగా అనిపించాయి ఆ మాటలు. నిరంజనం మనసులో ఏముందో తెలీదు. తన మనసును చదివినట్టుగా మాట్లాడుతున్నాడు. నిరంజనానికి సెంటిమెంట్లు ఎక్కువని అనుకున్నాడు విశ్వనాథం.

క్రమంగా చీకటిపడింది. అరుగుమీద నుంచి లేచి ఇంట్లోకి వెళ్ళాడు విశ్వనాథం. మరదలిచేత వేడినీళ్ళు పెట్టించుకుని స్నానం చేసి లుంగీ కట్టుకున్నాడు. విశ్వనాథం అదోరకం మనిషి. ఎక్కడకు వెళ్ళినా పరిస్థితులతో రాజీపడకుండా తనకు కావలసినవన్నీ సమకూర్చుకునే మనిషి.

ప్రభుత్వ ఉద్యోగి అని అతడికి ఒక గర్వం ఉంది.

దాయాదులు కాని ముగ్గురు ఆడవాళ్ళు వంటచేసి భోజనాలు వడ్డించారు. భోజనాలయ్యాక విశ్వనాథం వరండాలో మంచం వేయించుకుని పడుకున్నాడు. ఎక్కువసార్లు పోనందువల్ల వెంటనే నిద్రపట్టలేదు విశ్వనాథానికి.

కొంచెంసేపటికి నిరంజనం వచ్చి మంచంమీద కూర్చుని తెల్లారి తను అక్కడకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక చిన్న పల్లెటూరికి వెళ్ళబోతున్నట్టు చెప్పాడు.

"ఆ ఊరికా! ఎలా వెళతావు? బస్సులు లేవుగా. అయినా ఎందుకు? పనేమిటి? అని అడిగాడు విశ్వనాథం ఆశ్చర్యపడుతూ.

నిరంజనం నవ్వి "బస్సులు లేవు నిజమే! అడవి మధ్యలో కాలిబాటలో నడిచి వెళతాను. నిజంగా వెళ్ళాలని అనుకుంటే వెళ్ళటం ఏమంత కష్టం కాదులే" అన్నాడు.

ఎక్కడో తగిలినట్టు అనిపించింది విశ్వనాథానికి. అయినా ఆ ఫీలింగ్‌ని బయటకు రానివ్వకుండా "అంత పనేముంది?" అనడిగాడు నిరంజనాన్ని.

"నీకు తెలుసు. ఇంతకుముందు మేము నా చిన్నతనంలో ఆ ఊళ్ళోనే ఉండేవాళ్ళం. అక్కడ నుంచి వచ్చిన తర్వాత అప్పుడప్పుడు ఆ ఊరు వెళ్ళి వస్తున్నాను. ఈమధ్య ఆ ఊరు వెళ్ళి చాలారోజులయ్యింది. ఆ ఊళ్ళో అప్పట్లో మా ఇంటి ఎదురుగా ఉన్న ఇంట్లో మాధవయ్యగారు ఉన్నారు. ఆయన కూడా బాబాయి వయసు మనిషి! వెళ్ళి ఆయన్ని చూసి రావాలి" అన్నాడు నిరంజనం.

"ఆయన్ని చూడటం ఎందుకు?" అన్నాడు విశ్వనాథం.

"కృతజ్ఞత! మనిషనేవాడికి కనీస కృతజ్ఞత అంటూ ఒకటి ఉండాలికదా! మాధవయ్యగారికి నేనంటే ప్రేమ, ఇష్టం. ఆయన తన కొడుకులతోపాటు నా

చదువు విషయంలో కూడా శ్రద్ధ తీసుకున్నారు. మా నాన్న కొనివ్వలేని క్లాసుపుస్తకాలను నాకు కొనిచ్చేవారు. నన్ను కొడుకులా ఆదరించారు. ఆ వాత్సల్యాన్ని ఇప్పటికీ మరిచిపోలేను. ఆయనకు ఈమధ్య ఆరోగ్యం బాగా దెబ్బతిని మంచంలో ఉన్నారని తెలిసింది. ఎక్కువ రోజులు బతక్కపోవచ్చు.

ఒకసారి వెళ్ళి ఆయన్ని కలిసి ఆయనతో మాట్లాడితే ఆయనకీ, నాకూ తృప్తిగా ఉంటుంది. చనిపోయాక వెళ్ళొచ్చు. కానీ అప్పుడు నిర్జీవమైన ఆయన శరీరాన్ని మాత్రమే చూడగలను. బతికివుండగా వెళితే ఆయన శరీర కదలికలు చూస్తూ ఆయనతో మాట్లాడే అవకాశం ఉంటుంది. కొన్ని రకాల పనులు చేసిన తర్వాత పడే బాధకంటే చెయ్యకపోయినందువల్ల కలిగే బాధ జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది. అలా బాధపడటం నాకు ఇష్టం ఉండదు. మనం నిజంగా బాధ్యతతో చేసే ఏ పనిలో కూడా మనకు కష్టం ఉండదు" అన్నాడు నిరంజనం.

చటుక్కున మంచంమీద నుంచి లేచి కూర్చుని –

"నిజంగా వెళతావా?" అని అడిగాడు విశ్వనాథం. అలా ఎందుకు అడిగాడో అతనికే తెలీదు. అతడిలో ఏదో కదలిక మొదలయినట్టుంది.

"అవును.... వెళతాను. ఒక మనిషి బతికివుండగా కడసారిచూపు చూసి వస్తాను. ఇక ఎప్పుడూ ఆ దృశ్యమే నా కళ్ళముందు కనపడుతూ ఉంటుంది" తర్వాత ఎవ్వరూ మాట్లాడుకోలేదు. నిరంజనం ఆ మంచం పక్కనే చాప పరుచుకుని పడుకుని నిద్రపోయాడు.

విశ్వనాథానికి ఎంతసేపటికి నిద్ర రాలేదు.

కళ్ళముందు తండ్రి రూపం కనపడింది.

ఆ ఇంట్లో తల్లి లేని తమని తండ్రి పెంచి పెద్దచేసి చదువు చెప్పించడానికి ఎన్ని కష్టాలు పడ్డాడో ఒకటొకటిగా గుర్తుకొచ్చాయి. కొడుకుల్ని ప్రయోజకులని చేసాడు. కానీ చివరకు తను విశ్వాసహీనుడిగా ప్రవర్తించాడు.

పాసింజర్ బస్సులో ఎక్కువసేపు కూర్చోవలసివస్తుందని తండ్రి కడసారిచూపును కూడా దక్కించుకోలేకపోయాడు. అతడికి తెలియకుండానే అతడి కళ్ళు తడి అయినాయి.

చివరకు ఎప్పటికో నిద్రపోయాడు.

చీకట్లు పూర్తిగా విచ్చుకోకముందే విశ్వనాథానికి మెలకువ వచ్చింది. పక్కనే

చాపమీద నిరంజనం లేదు. అప్పటికే లేచి వెళ్ళిపోయాడు. ఎప్పుడు వెళ్ళాడు? చాప ఖాళీగా ఉంది. మంచంమీద లేచి కూర్చున్నాడు విశ్వనాథం.

ఇక పడుకోవాలని అనిపించలేదు. క్రమంగా తెల్లవారుతోంది. లేచి షర్టు వేసుకుని ఇంట్లోనుంచి బయటకు వచ్చి రోడ్డెక్కాడు.

రోడ్డుమీద సంచారం మొదలయ్యింది.

చిన్నగా నడుస్తూ ఊరి బయటకు వచ్చాడు. వాగు పక్కనే ఉంది స్మశానం. వాగులో అంతగా నీళ్ళు లేవు. వాగుమీద ఉన్న చెక్కవంతెన దాటి స్మశానంలోకి వచ్చాడు విశ్వనాథం.

మొదట్లోనే కనపడింది కాలిపోయిన కట్టెల తాలూకూ బూడిద కుప్ప. మొత్తంమీద ఒకే ఒక్కటి ఉంది. పక్కనే పాడె. అదే తన తండ్రి చితి అయిఉంటుందని అనుకున్నాడు. పూర్తిగా కాలిన కట్టెలబూడిద కూలిపోయి ఉంది.

అక్కడ నిలబడ్డాడు విశ్వనాథం.

అతడికి అప్రయత్నంగానే ఏడుపు వచ్చింది. తను పాసింజర్ బస్సు ఎక్కివస్తే బాగుండేది. కనీసం తండ్రి శవాన్ని కడసారిగా చూసి ఉండేవాడు. జబ్బుగా ఉందని తెలిసిన తర్వాత కూడా రాలేదు. మూడేళ్ళయ్యింది ఆయన చూసి.

తనంత నీచుడు ఇంకొకడు ఉండడని అనుకున్నాడు విశ్వనాథం. తమకోసం ఎన్నో సుఖాలను త్యాగం చేసిన తండ్రికంటే తన సుఖమే ముఖ్యమనుకున్నాడు.

విశ్వాసహీనుడిగా ప్రవర్తించాడు.

తనలో కనీస కృతజ్ఞత కూడా లేదు.

ఈ సమయంలో నిరంజనం చెప్పిన మాటలు గుర్తుకువచ్చాయి.

ఒక పనిని చెయ్యనందువల్ల కలిగే బాధ జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది.

విశ్వనాథం శరీరం తూలింది.

అతను తండ్రి చితిమీద కుప్పకూలాడు. ❖

*చిత్ర మాసపత్రిక, ఫిబ్రవరి 2008*